రాజస్థాన్‌లో గుజ్జర్ల ఆందోళన

రాజస్థాన్‌లో గుజ్జర్లు తమను షెడ్యూల్డ్ తెగల్లో(ఎస్టీ) చేర్చాలంటూ... గతేడాది మే నెలలో ప్రారంభించిన ఆందోళన మళ్లీ ఉధృతంగా మొదలయింది. ప్రస్తుతం వెనుకబడిన తరగతుల్లో(ఓబీసీ) ఉన్న తమ కులాన్ని ఎస్టీల్లో కలిపితేనే.. రాజస్థాన్‌లో తమ సామాజిక వర్గానికి న్యాయం జరుగుతుందని ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న గుజ్జర్ ఆరక్షణ్ సమితి నేత కల్నల్ కిరోడీ సింగ్ బైంసలా వాదిస్తున్నారు.

ఉత్తరాదిలో స్థిరపడిన అనేక కులాల ప్రజల మాదిరిగానే.. మధ్య ఆసియా నుంచి వందలాది ఏళ్ల క్రితం గుజ్జర్లు భారత దేశానికి వలసవచ్చారని చెబుతారు. గుజ్జర్లు పెద్ద సంఖ్యలో నివసిస్తున్న కారణంగా.. పశ్చిమ రాష్ట్రమైన గుజరాత్‌కు ఆ పేరొచ్చిందనే వాదన ఉంది. మొదట గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవించిన గుజ్జర్లు ... దేశంలోని ఉత్తర, వాయవ్య ప్రాంతాల్లో అనేక వృత్తుల్లో స్థిరపడ్డారు. దేశ వ్యాప్తంగా కోటిన్నర వరకూ ఉన్న వీరు... పశుపోషణ నుంచి వ్యవసాయం, రవాణా రంగం, ఉద్యోగాలు, ఇతర సేవల రంగాల్లో విస్తరించి ఉన్నారు. ఇప్పటికీ సంచారజీవనం గడిపే ఈ కులస్తుల జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉంది.

ఎస్టీ జాబితాలో:

గుజ్జర్లు జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఎస్టీ జాబితాలో ఉన్నారు. గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లో ఓబీసీ జాబితాలో ఉన్నారు. ఎక్కువగా వ్యవసాయం,పశుపోషణపై ఆధారపడడమే వారిని బీసీల్లో చేర్చడానికి ప్రధాన కారణం. ఆధునిక జీవనానికి దూరంగా ఉంటూ... అడవులు, కొండ ప్రాంతాల్లో బతికే సామాజిక వర్గాలకే అనుసూచిత జాతుల(తెగలు) జాబితాలో (ఎస్టీలు) చోటు దొరుకుతుంది. అందుకే పెద్ద సంఖ్యలో గేదెలు, గొర్రెలను మేపుతూ.. ప్రతి ఏటా రెండు మూడు రాష్ట్రాల సరిహద్దులు దాటే గుజ్జర్లకు కాశ్మీర్, హిమాచల్‌లలో ఎస్టీ హోదా లభించింది.

శ్వేత హుణులు:

గుజ్జర్లు మధ్య ఆసియాలోని శ్వేత హుణుల సంతతికి చెందినవారని కొందరు సామాజిక శాస్త్రవేత్తలు చెబుతారు. రాజస్థాన్, పంజాబ్‌లోనే వారి జనాభా ఎక్కువ. పంజాబ్‌లో హిందూ సమాజంలోని జాట్ల మాదిరిగానే.. గుజ్జర్లు కూడా పెద్ద సంఖ్యలో ఇస్లాం, సిక్కు ధర్మాలు స్వీకరించారు. అందుకే పాకిస్థాన్‌లోని పంజాబ్‌లో ముస్లింలుగా మారిన గుజ్జర్లు అధిక సంఖ్యలో కనిపిస్తారు. ప్రఖ్యాత పాక్ క్రికెటర్ షోయెబ్ అఖ్తర్ కూడా కసానా అనే గుజ్జర్ గోత్రానికి చెందినవాడు. ఆంగ్లేయుల పాలన దేశంలో మొదలయ్యే సమయానికే రాజస్థాన్‌లోని పలుప్రాంతాల్లో ఈ కులస్తులు కొందరు వ్యవసాయంలో స్థిరపడ్డారు. మరి కొందరు అనేక రాజ్యాల సైన్యాల్లో చేరారు. రాజస్థాన్ నుంచి పశ్చిమ ఉత్తరప్రదేశ్ వరకూ ఉన్న రాజ్యాల్లో వారు గణనీయ సంఖ్యలో సైనికులుగా పనిచేస్తున్న సమయంలోనే... 1857లో బ్రిటిష్ ఈస్టిండియా

కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన సిపాయిల తిరుగుబాటులో పాల్గొన్నారు. ఫలితంగా బ్రిటీష్ పాలకులు గుజ్జర్లను వేధించారు. వారి వ్యవసాయ భూములులాక్కున్నారు. చివరికి వారిని బందిపోట్లుగా ముద్రవేసి జైళ్లకు పంపారు. మరి కొందరినైతే నేరాలు చేయడమే వృత్తిగా స్వీకరించారని నిర్ధారిస్తూ.. నేరాలు చేసే జాతుల జాబితాలో చేర్చారు. ఆ రోజుల్లో వ్యవసాయం చేసే గుజ్జర్లు... తమ దిగుబడిలో 60 శాతం శిస్తుగా చెల్లించాల్సివచ్చేది.

మండల్ సమయంలో:

స్వాతంత్ర్యం వచ్చాక కూడా వారి జీవనంలో పెద్ద మార్పు రాలేదు. ఢిల్లీ విమానాశ్రయ నిర్మాణానికి పాలంలో గుజ్జర్ల భూములను ప్రభుత్వం పెద్దగా నష్టపరిహారం చెల్లించకుండానే సేకరించింది. 1977లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వాలు కూలిపోయాక ... 1980లో జరిగిన లోక్‌సభ ఎన్నికల సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో గుజ్జర్లు అనే సామాజికవర్గం ఉన్న విషయం దక్షిణాది ప్రజలకు తెలిసింది. మళ్లీ 1990లో మండల్ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నడచిన ఆందోళన సందర్భంగా కూడా గుజ్జర్ల ఉనికి గురించి అందరికీ తెలిసింది. ఆ సమయంలోనే రామజన్మభూమి ఉద్యమం ద్వారా హిందువులను సమీకరించడానికి ప్రయత్నించిన బీజేపీ... జనతాదళ్ దారిలో కూడా పయనిస్తూ హిందీ ప్రాంతాల్లో బీసీలను హిందూత్వ వైపు ఆకర్షించడానికి ప్రయత్నాలు ప్రారంభించింది. కమండలాన్ని (అయోధ్యలో రామాలయ నిర్మాణం) వదలకుండానే... మండల్(బీసీ) కులాలను ఆకర్షించడానికి నడుం కట్టింది. ఈ క్రమంలో బీసీలకు యూపీ, హర్యానాలో నాయకత్వం వహించిన జాట్లను ఆకట్టుకోవడానికి 1999లో ఎ.బి.వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు జాట్లను ఓబీసీ జాబితాలో చేర్చింది.

2003లో బీజేపీ వాగ్దానం:

రాజస్థాన్‌లో 15 శాతం వరకూ జనాభా ఉన్న జాట్లు... ఇతర బీసీలతో పోల్చితే అభివృద్ధిచెందిన సామాజికవర్గం. ఆరు శాతం వరకూ జనాభా ఉన్న మరో బీసీ వర్గం గుజ్జర్లు. 2003 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తాము గెలిస్తే.. గుజ్జర్లను ఎస్టీల జబితాలో చేర్చుతామని బీజేపీ వాగ్దానం చేసింది. బీసీ జాబితాలోకి జాట్ల రాకతో అవకాశాలు కోల్పోయామని భావిస్తున్న గుజ్జర్ల మద్దతు సంపాదించి అధికారంలోకి వచ్చింది. దాంతో తమ డిమాండును నేరవేర్చమని కోరుతూ..గత వేసవిలో వీధుల్లోకి వచ్చి, హింసాత్మక ఆందోళనకు దిగారు. చివరికి చర్చల ఫలితంగా ఆందోళన విరమించారు. అయితే మళ్లీ ఈ మే నెల్లో ఉద్యమం మొదలెట్టారు. గుజ్జర్లను ఎస్టీల్లో చేర్చే అధికారం కేంద్రానిదే కాబట్టి వారిని ఎస్టీల్లో చేర్చాలంటూ..రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే యూపీఏ సర్కారుకు లేఖ రాసి, చేతులు దులిపేసుకునే ప్రయత్నం చేశారు!!